సాక్షి
విజయనగరం
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



సైకిల్ మరి తొక్కలేం బాబు..
తుప్పు పట్టిన ఆ సైకిల్‌ను మరి తొక్కలేం బాబూ.. అంటూ టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఆ పార్టీను వీడి 'ఫ్యాన్' కిందకు చేరుతున్నారు. - 8లో



రామతీర్థంలో ఆదిత్య హృదయ హోమం - 8లో
రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు.



ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి
ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

బ్యాంకు ఖాతాలకు పింఛన్ డబ్బులు

- దివ్యాంగులు, మంచంమీద ఉన్న రోగులకు మాత్రమే ఇళ్ల వద్ద పంపిణీ
- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా పింఛన్‌దారులకు మే, జూన్ నెలల పింఛన్ డబ్బులు డీబీటీ పద్ధతిలో బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని కలెక్టర్ నాగలక్ష్మి ఆదివారం తెలిపారు. దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న వారు, మంచం మీద ఉన్న రోగులు, చక్రాల కుర్చీలకు పరిమితమైన వారికి మాత్రమే ఇంటివద్ద సచివాలయ సిబ్బంది ఒకటో తేదీ నుంచి పింఛన్ అందజేస్తారన్నారు. ఇంటింటికీ పింఛన్ ఇచ్చే వారి వివరాలు, డీబీటీ ద్వారా పెన్షన్ జమచేసే వారి వివరాలను సచివాలయంలో ప్రదర్శిస్తామని చెప్పారు. పింఛన్ తీసుకునేందుకు ఎవ్వరూ సచివాలయం, లేదా ఏ ఇతర ఆఫీసులకు వెళ్లాల్సిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- యువతకు పిలుపునిచ్చిన మేఘాలయ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.ఎస్.కుమార్



సదస్సులో మాట్లాడుతున్న కె.ఎస్.కుమార్

రాజాం సిటీ: యువత ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని మేఘాలయ చీఫ్ సెక్రటరీ, మాజీ ఐఏఎస్ కె.ఎస్.కుమార్ అన్నారు. స్థానిక ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సివిల్ సర్వీసెస్‌పై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థుల చదువుకు ఫౌండేషన్ ద్వారా అండగా నిలుస్తున్న మదన్‌ను అభినందించారు. ఈ ప్రాంతంలో ఎంతోమంది తెలివైన యువతీయువకులు ఉన్నారని, లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు మెరిట్ స్టూడెంట్స్‌కు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఐజీ జీహెచ్‌పీ రాజు, మాజీ ఐఏఎస్ ఎన్.సాంబశివరావు, ఐఆర్ఎస్ డిప్యూటీ కమిషనర్ డి.కల్యాణచక్రవర్తి, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, వి.జగన్నాథనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ప్రాంతంలో ప్రయాణికుల సందడి



సెలవు పండగ

విద్యాలయాలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు ఉత్సాహంగా చేరుకుంటున్నారు. వీరి రాకపోకలతో విజయనగరం రైల్వేస్టేషన్, కాంప్లెక్స్‌లు కళకళలాడుతున్నాయి. వీటికి ఈ చిత్రాలే సాక్ష్యం.
– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



ఎస్.కోట నియోజకవర్గం.. విశాఖపట్నానికి చేరువ. జామి, కొత్తవలస మండలాలు విశాఖ సరిహద్దులోనే ఉన్నాయి. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎస్.కోట అసెంబ్లీ సెగ్మెంట్ ఇమిడి ఉంది. విశాఖను పరిపాలనా రాజధానిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం, అధికారంలోకి వచ్చిన వెంటనే పాలన ఇక్కడ నుంచే సాగుతుందని మేనిఫెస్టోలో సుస్పష్టం చేయడంతో 'కోట'లో కొత్త ఉత్సాహం నెలకొంది. ప్రగతి పవనాలు జోరుగా వీస్తున్నాయి. భావితరాలకు బంగారు భవిత కలుగుతుందని మేధావి వర్గం చెబుతోంది. సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తోంది.

కోటలో ప్రగతి పవనాలు

- విశాఖ నుంచే పాలన సాగుతుందని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- ఆ మేరకు మేనిఫెస్టోలోనూ ప్రకటన
- విశాఖకు చేరువగా ఉన్న ఎస్.కోట నియోజకవర్గ ప్రజల్లో కొత్త ఉత్సాహం
- అభివృద్ధి పనుల్లో జోరు
- ఇప్పటికే విస్తరించిన హోటల్ రంగం
- ఊపందుకున్న రియల్ ఎస్టేట్ రంగం
- అత్యాధునిక వసతులతో అతిథి గృహాలు
- చురుగ్గా రోడ్ల విస్తరణ పనులు
- విస్తరిస్తున్న పరిశ్రమలు
- యువతకు బంగారు భవిత
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్న మేధావి వర్గం



లక్కవరపుకోట: సుదీర్ఘమైన తీర ప్రాంతం.. వాణిజ్య అవసరాలకు అనువుగా ఓడ రేవులు.. విశాలమైన రహదారులు.. రైలు, జలవాయు రవాణా సౌకర్యాలతో చెన్నై, ముంబయి వంటి మహానగరాలతో పోటీపడుతున్న విశాఖను రాష్ట్ర పరిపాలన రాజధానిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోన్‌రెడ్డి ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పరిపాలన విశాఖ నుంచే సాగుతుందని 2024 ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారు. సీఎం నిర్ణయంతో విశాఖకు పొరుగునే ఉన్న ఎస్.కోట నియోజకవర్గంలో ప్రగతి పవనాలు బలంగా వీస్తున్నాయి. వివిధ రంగాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. భవిష్యత్తులో ఎస్.కోట నియోజకవర్గం బంగారు మయం అవుతుందని, ఈ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తా యని మేధావి వర్గం అంచనా వేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాన్ని స్వాగతిస్తోంది.

ఎస్.కోటలో అభివృద్ధి జోరు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వినూత్న నిర్ణయాలు, పాలనతో ఎస్.కోట నియోజకవర్గం ప్రగతి పట్టాలెక్కింది. వివిధ సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి వర్గాల్లో ఆర్థికోన్నతి స్పష్టంగా కనిపిస్తోంది. విశాఖకు చేరువగా ఉండడంతో మౌలిక వసతులతో పాటు హోటల్, పర్యాటక, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక రంగాలు ప్రగతిబాట పట్టాయి. ఈ ప్రాంతంలో కోట్లాది రూపాయల పెట్టుబడితో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఉత్సుకత చూపుతున్నారు.

- ఇప్పటికే కొత్తవలస మండలంలో శారద కర్మాగారం యాజమాన్యం సుమారు రూ.5వేల కోట్లతో మరో యూనిట్‌ను విస్తరించింది. అప్పన్నపాలెం పంచాయతీ దన్నానపేట గ్రామ సమీపంలో ఆల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం ఏర్పాటుకు గతనెలలో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయింది. లక్కవరపుకోట మండలం శ్రీరాంపురం, ఆర్.జీ.పేటల సమీపంలోని మహామాయ కర్మాగారంలో ఇంటిగ్రేడ్ ప్లాంట్‌గా విస్తరించేందుకు గత నెలలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. శృంగవరపుకోట మండలం బొడ్డవర సమీపంలో జిందాల్ కర్మాగారం నిర్మాణానికి సేకరించిన భూములను ప్రస్తుత ప్రభుత్వం పారిశ్రామిక కారిడార్‌గా ప్రకటించింది. దీంతో పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఏర్పడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.



రోడ్ల విస్తరణ

ఎస్.కోట నియోజకవర్గంలో ప్రస్తుతం ప్రధాన రోడ్లు ముస్తాబవుతున్నాయి. విశాఖ–అరకు రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి రూ. 850 కోట్లతో నాలుగు లైన్‌ల రోడ్డుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. మరోవైపు రూ.20వేల కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న విశాఖపట్నం–రాయపూర్ (గ్రీన్ ఫీల్డు హైవే) రహదారి ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఇది ఎస్.కోట నియోజకవర్గం మీదుగా సాగడంతో ఈ ప్రాంత ఆర్థిక ప్రగతికి 'మార్గం' సుగమమైంది.

విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ రంగం

విశాఖకు చేరువగా ఉన్న ఎస్.కోట నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది. జాతీయ రహదారులు విస్తరించడం, అరకు పర్యాటక ప్రదేశానికి వెళ్లే మార్గం కావడం, రైల్వేస్టేషన్లు అందుబాటులో ఉండడం, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో ఆ మేరకు రియల్ ఎస్టేట్ రంగం విస్తరిస్తోంది. కొత్తవలస, ఎస్.కోట, వేపాడ, జామి మండలాల్లో వేలకోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలు సాగుతున్నాయి. కొత్తవలస, ఎస్.కోట పట్టణాల్లో భవన నిర్మాణాలు ఊపందుకున్నాయి.

- ప్రస్తుతం కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, ఎస్.కోట మండలాల్లో అత్యంత విలాసవంతమైన రిసార్ట్స్, అతిథి గృహాలు వెలశాయి. పర్యాటకులు, ప్రముఖులు విడిది చేసేందుకు వీలుగా రిసార్ట్స్ సిద్ధమయ్యాయి. విశాఖను పరిపాలన రాజధానిగా గుర్తించడం ఈ ప్రాంత ప్రజలు అదృష్టంగా భావిస్తున్నారు.

సమగ్రాభివృద్ధికి మార్గం



విశాఖను పరిపాలన రాజధాని చేస్తూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం.. వెనుకబడిన ప్రాంతమైన శృంగవరపుకోట నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి దోహదపడుతుంది. ప్రతిపక్షాలు పనిగట్టుకొని కోర్టుల్లో కేసులు వేసి ఆపాలనుకోవడం విచారకరం. అమరావతి కంటే విశాఖ రాజధానికి అనుకూలం. ఆర్థిక అసమానతలు తొలగించి అన్ని ప్రాంతాల అభివృద్ధికి సముచిత స్థానం కల్పిస్తున్న సీఎం నిర్ణయం సాహసోపేతమైనది. దీనిని ప్రతి ఒక్కరూ స్వాగతించాలి. మద్దతుగా నిలవాలి.
– వడ్లమాని రమణమూర్తి, మేధావివర్గం, లక్కవరపుకోట మండలం

పుట్టెడు ఆశతో ఉన్నాం



జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం నుంచే పరిపాలన సాగుతుందని మేనిఫెస్టోలో పేర్కొనడం చాలా సంతోషకరమైన విషయం. ఆ రోజు కోసం ఆశగా ఎదురు చూస్తున్నాం. ఇది దగ్గరలోనే ఉంది. మళ్లీ ఆయన సీఎం అవుతారు. ఎస్.కోట అభివృద్ధి చెందుతుంది. మల్టీ నేషనల్ కంపెనీలన్నీ ఈ ప్రాంతానికి వస్తాయి. పాలనా కార్యాలయాలు ఏర్పడతాయి. యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి. మా లాంటి యువకులకు, భావితరాల వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. ఈ ఫలాలను అందుకునేందుకు మా వంతు సాయం జగన్‌మోహన్‌రెడ్డికి అందిస్తాం.
– మిడతాన గణేష్, భీమాళి గ్రామం, లక్కవరపుకోట మండలం

యువతకు ఉపాధి



ఎస్.కోట నియోజకవర్గం విశాఖపట్నానికి చేరువ. రాజధాని పక్కనే ఉండడం వల్ల అభివృద్ధి వేగంగా జరుగుతుంది. విద్యా, వైద్య, పారిశ్రామిక రంగాలు విస్తరిస్తాయి. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇది జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో నియోజకవర్గ ప్రజలకు కలిగిన అదృష్టం. దీనిని సాకారం చేసుకోవాల్సిన బాధ్యత ఈ ప్రాంత ప్రజలపై ఉంది.
– డాక్టర్ పెంట అప్పారావు, విశ్రాంత ఎంఈఓ, పెదరావుపల్లి గ్రామం, కొత్తవలస మండలం

రాజకీయ ప్రాధాన్యం పెరుగుతుంది



విశాఖపట్నం పరిపాలన రాజధాని అయితే ఈ ప్రాంతంలో రాజకీయ ప్రాధాన్యం పెరుగుతుంది. మాలాంటి యువ రాజకీయ వేత్తలకు మంచి భవిష్యత్తు ఉంటుంది. రాజధాని కల సాకారం కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాల్సిందే. కలను నెరవేర్చుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం.
– గుమ్మడి సత్యనారాయణ, యువ రాజకీయనాయకుడు, లక్కవరపుకోట మండలం



ఆధునికీకరణ దిశగా కొత్తవలస రైల్వేస్టేషన్

ముస్తాబవుతున్న రైల్వేస్టేషన్

విశాఖపట్నానికి చేరువలో ఎస్.కోట నియోజకవర్గంలోని కొత్తవలస రైల్వేస్టేషన్‌ను భవిష్యత్తు అవసరాలకు అనువుగా కేంద్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. రాష్ట్ర ప్రభుత్వ వినతి మేరకు రూ.22 కోట్లతో ఆధునీకరిస్తోంది. ఈ పనులకు గత నెలలోనే రైల్వే ఉన్నతాధికారులతో కలిసి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ప్లాట్‌ఫారాలు, ముఖద్వారాలు, లిఫ్టులు తదితర పనులు తలపెట్టారు.



కొత్తవలస రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు రైల్వే అధికారులతో కలిసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

సీఎం జగన్‌తోనే దళితులకు రక్షణ

- ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంకి సుధాకర్ మాదిగ

రామభద్రపురం:

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే దళితులకు రక్షణ ఉంటుందని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంకి సుధాకర్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అద్భుత పాలనను చూసి మా రాష్ట్ర అధ్యక్షుడు ముసిడిపాటి బ్రహ్మయ్య మాదిగ వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటించారన్నారు. దళితుల అభ్యున్నతికి అండగా ఉండేలా సీఎం మేనిఫెస్టో ప్రవేశపెట్టారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు జనాభాలో 50 శాతం దళితులు, 500 పైగా ఆవాసాలుంటే ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేస్తూ మరింత గుర్తింపు ఇచ్చారన్నారు. దళితులను ఆదుకునేలా నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయాన్ని కొనసాగిస్తామని చెప్పడం హర్షణీయమన్నారు. మాదిగల అభివృద్ధికి కృషిచేస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని, దీనికి దళితులమంతా కట్టుబడి ఉన్నట్టు పేర్కొన్నారు. ఆయన వెంట కిల్లాడ శివమాదిగ, కిల్లాడ రాజు, యజ్జల సురేష్ మాదిగ, పి.అప్పలకొండ మాదిగ ఉన్నారు.



మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంకి సుధాకర్ మాదిగ

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ

- రీ వెరిఫికేషన్‌కూ అవకాశం
- ఈ నెల 30వ తేదీ వరకు గడువు
- అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల
- మే 24 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు

విజయనగరం అర్బన్: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. హాజరుకావాలనుకునే వారు సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చు. మూడు సబ్జెక్టులలోపు రాసే అభ్యర్థులు రూ.110 చెల్లిస్తే సరిపోతుంది. మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువ సబ్జెక్టులు రాసేవారు రూ.125 చెల్లించాల్సి ఉంటుంది. మే ఒకటి నుంచి 23వ తేదీ వరకు రూ.50ల అపరాధ రుసుంతో ఫీజును చెల్లించే వీలుంది. అలాగే, మార్కులు తక్కువ వచ్చినట్టు అనుమానం ఉన్నవారు పునఃమూల్యాంకం (రీ వెరిఫికేషన్) కోసం ఈ నెల 30వ తేదీ రాత్రి 11 గంటల వరకు సంబంధిత పాఠశాల హెచ్‌ఎంకు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. డీడీలు స్వీకరించరు. రీ వెరిఫికేషన్ ఫీజుగా ఒక్కో సబ్జెక్టుకు రూ.1000, రీ కౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చెల్లించాలి. బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలి. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోనవసరం లేదు. రీ వెరిఫికేషన్ అంటే పరీక్ష పేపర్లను తిరిగి మూల్యాంకనం చేయరు. ఇచ్చిన మార్కులను తిరిగి లెక్కిస్తారు. రాసిన సమాధానాలన్నింటికీ మార్కులు వచ్చాయా లేదా అన్నది ధ్రువీకరిస్తారు. జవాబు పత్రంలో దిద్దని ప్రశ్నలు ఉంటే దిద్ది మార్కులు కేటాయిస్తారు. స్కానింగ్ చేసిన జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో విద్యార్థికి అందిస్తారు. రీ కౌంటింగ్ విషయంలో మార్కుల మొత్తం మరోసారి కూడతారు. తప్పుగా కూడి ఉంటే సరిచేసి మార్కులు వేస్తారు. అంతే తప్ప పేపరు విద్యార్థికి ఇవ్వరు.

ప్రణాళికా బద్ధంగా రిసెప్షన్ కౌంటర్లు

- సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్:

ఎన్నికల రిసెప్షన్ కౌంటర్ల ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా జరగాలని, సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రిసెప్షన్ సెంటర్ సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం శిక్షణ ఇచ్చారు. కౌంటర్ల ఏర్పాటు, విధులు, సదుపాయాలు, పార్కింగ్ తదితర అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. రోజంతా ఎంతో కష్టపడి ఎన్నికల విధులను నిర్వహించి, ఈవీఎం ఇతర సామగ్రితో తిరిగి వచ్చే సిబ్బంది బస్సులో నుంచి దిగగానే తాము వెళ్లాల్సిన కౌంటర్లకు సులభంగా చేరుకునేలా డైరెక్షన్ బోర్డులు, నేమ్ బోర్డులు ఉండాలన్నారు. తాగునీరు, ఫుడ్ కౌంటర్లు, మరుగుదొడ్లు, పార్కింగ్ ప్రదేశాలను తెలియజేసేలా పెద్దసైజులో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో నియోజకవర్గానికి సుమారు 10 నుంచి 12 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడే ఈవీఎలను, ముఖ్యమైన పత్రాలను అందజేయాల్సి ఉంటుందన్నారు. సాధారణ కౌంటర్లలో ఇతర ఎన్నిక సామగ్రిని సమర్పించాలని చెప్పారు. స్పెషల్ కౌంటర్‌లో నలుగురు సిబ్బంది, ఇద్దరు సహాయకులు, ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేందుకు మరో ఇద్దరు సహాయకులు ఉంటారని తెలిపారు. సాధారణ కౌంటర్‌లో ఇద్దరు సిబ్బంది, సహాయకులు, సామగ్రిని తరలించేందుకు మరో ఇద్దరు సహాయకులు ఉంటారని వివరించారు. ఒక్కో రిసెప్షన్ సెంటర్ పర్యవేక్షణకు ఇద్దరు జిల్లా అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించామని కలెక్టర్ వివరించారు. విజయనగరం, బొబ్బిలి అసెంబ్లీ స్థానాలను ఓట్లు లెక్కింపు జరిగే జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ రిసెప్షన్ సెంటర్‌కు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, మిగిలిన అసెంబ్లీ స్థానాల లెక్కింపు జరిగే లెండి కళాశాలకు మెప్మా పీడీ సుధాకర్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావును ఇన్‌చార్జిలుగా నియమించినట్టు వెల్లడించారు. రిసెప్షన్ సెంటర్‌లో టాబ్యులేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఓటర్ల నమోదు వివరాలను అక్కడే సమర్పించాలని సూచించారు. పరిశీలకుల కోసం కూడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, మరుసటి రోజు అక్కడ స్క్రూటినీ చేస్తామని తెలిపారు. ఏ కౌంటర్లో ఇవ్వాల్సిన వివరాలను అక్కడే ఇవ్వాలన్నారు. ఏమైనా సందేహాలు తలెత్తితే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. స్పెషల్ కౌంటర్‌లో సమయ నిర్వహణ చాలా కీలకమని, ఇక్కడ పని వేగంగా జరగాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను నిర్దేశించిన విధంగానే భద్రపరచాలని చెప్పారు. సెక్టార్ అధికారుల కౌంటర్లో రిజర్వుడు ఈవీఎంలను అందజేయాలని సూచించారు. కౌంటర్లలోని సిబ్బంది, పీఓలు ఇచ్చే వివరాలను చాలా జాగ్రత్తగా తనిఖీ చేయాలని, కచ్చితమైన వివరాలను మాత్రమే నమోదు చేసేలా చూడాలని చెప్పారు. ఎన్నికల సిబ్బంది అందరికీ మంచి భోజనాన్ని ఏర్పాటు చేయాలని, తాగునీరు, ఇతర అవసరాలను ఇబ్బంది పడకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో ఎస్.డి.అనిత, పార్లమెంట్ ఏఆర్ఓ సుమబాల, రిటర్నింగ్ అధికారులు, వేదిక ఇన్‌చార్జిలు, నోడల్ అధికారులు, ఏఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన జిల్లా అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

క్లుప్తంగా

రామతీర్థంలో ఆదిత్య హృదయ హోమం



యాగశాలలో హోమాలు జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ రామస్వామి వారి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలనంతరం యాగశాలలో సుందరకాండ, ఆదిత్య హృదయం, గాయత్రీ రామాయణం, సుదర్శన అష్టకం, సుదర్శన హవనం, తదితర హోమాలను వైభవంగా జరిపించారు. అనంతరం స్వామి వెండి మండపం వద్ద సీతారాముల నిత్యకల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు నరిసింహాచార్యులు, సాయిరామాచార్యులు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కొట్లాటపై కేసు నమోదు

భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామంలో ఆదివారం ఇరువురి మధ్య జరిగిన కొట్లాటపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు... లింగాలవలస గ్రామానికి చెందిన బాడితబోయిన శ్రీను కాంట్రాక్టు పద్ధతిలో భీమిలిలో పోస్టుమాన్‌గా విధులు నిర్వహిస్తూ ఖాళీ సమయంలో ఆటో నడుపుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. త్వరలోనే తన ఇంట్లో శుభకార్యం ఉందని చెప్పి ఆదివారం సెలవు కావడంతో తన ఆటోలో బియ్యం ప్యాకెట్లను వేసుకుని పిండి ఆడించుకునేందుకు సవరవల్లి మిల్లుకు బయలు దేరాడు. ఈ క్రమంలో రోడ్డుకు అడ్డంగా వేరే వాహనాలు ఉండడంతో వాహనాలను పక్కకు తీయమని వాహన యాజమానులకు సూచించాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన ముని కిషోర్, సూర్యారావు, మాని సన్యాసినాయుడులు శ్రీనుతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడడంతో బాడితబోయిన శ్రీను తీవ్ర గాయాల పాలయ్యాడు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

సంతకవిటి: నాగావళి నదీ తీరం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న తాలాడ గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ షేక్ శంఖర్ తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలేరు సమీపంలో ఏనుగులు



బాలేరు సమీప పంటపొలాల్లో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తాలాడ సమీప తోటల నుంచి ఏనుగుల గుంపు ఆదివారం బాలేరు వైపు నడిచింది. తోటల సమీపంలోని మొక్కజొన్న పంటల కోతలు పూర్తి కావడంతో సరైన మేత లేక బాలేరు పంటపొలాలకు తరలివెళ్లాయని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా ఉదయానికే పంటపొలాల్లో నాలుగు ఏనుగుల గుంపు పంట చేలను తినివేశాయని రైతులు వాపోతున్నారు. పచ్చని పంట పొలాల్లో ఏనుగులు విచ్చలవిడిగా తిరుగాడాయని తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹260

సైకిల్ మరి తొక్కలేం బాబు..

- వైఎస్సార్‌సీపీలో చేరిన పలు టీడీపీ కుటుంబాలు
- కండువాలు వేసి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



టీడీపీను వీడి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: తుప్పు పట్టిన ఆ సైకిల్‌ను మరి తొక్కలేం బాబూ.. అంటూ టీడీపీ నుంచి విముక్తి తీసుకుంటామంటూ కార్యకర్తలు, నాయకులు ఆ పార్టీను వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. అందులో భాగంగానే పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని గత్సలవలస గ్రామానికి చెందిన సిమ్మాల రాంబాబు, శ్రీరాములు, అప్పారావు, సత్యనారాయణ, యరకయ్య, తారక్, శివ తదితర 20 కుటుంబాలు టీడీపీను వీడి వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీలోకి వచ్చిన వీరిని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఆయన చెప్పారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన త్రినాధరావు, గ్రామ నాయకులు జమ్ము సునీల్, గంగుబిల్లి తాడు, సిమ్మాల అప్పన్న, పిసిని మహేష్ తదితరులు పాల్గొన్నారు.



బొండపల్లి : టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు



మెరకముడిదాం: రామాయవలసలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఆ పార్టీ నాయకులు

టీడీపీని వీడిన 50 కుటుంబాలు

బొండపల్లి: మండలంలోని మరువాడ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సమక్షంలో చేరి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వెన్నెల సూరిబాబు, ఈదుబిల్లి రామునాయుడులతో పాటు గ్రామానికి చెందిన 50 కుటుంబాల వారు పార్టీలో చేరగా వారందరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. పార్టీ విధానాలు నచ్చే పార్టీలో చేరడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.సూర్యనారాయణమూర్తిరాజు(సురేష్‌బాబు), వైఎస్సార్‌సీపీ యువ నాయకులు బొత్స సాయి గురునాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, పార్టీ రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభూజీరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బోద్దల చిన్నంనాయుడు, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి...

మెరకముడిదాం: మండలంలోని రామాయవలస గ్రామానికి చెందిన 50 కుటుంబాలకు చెందిన వారు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం రాత్రి పార్టీ నాయకులు ఎస్.వి. రమణరాజు, తాడ్డి వేణుగోపాల్‌రావు, మంత్రి బొత్స సత్యనారాయణ సోదరి ఊటపల్లి సర్పంచ్ సంగంరెడ్డి వెంకటలక్ష్మి, డాక్టర్ బొత్స సందీప్ భార్య బొత్స పూజితల సమక్షంలో రామాయవలస గ్రామానికి చెందిన గొర్లె ఆదినారాయణ, నెమ్మాది వెంకటరమణ, ముడిల ఆదినారాయణ(పండోడు), దాసరి సన్యాసినాయుడు, గేదెల మధు, వెంపడాపు రమణ, గొర్లె కన్నంనాయుడు, కొమ్ము ఎర్రిబాబు తదితర 50కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎస్.సీ తారామరాజు, ఎస్.కృష్ణమూర్తిరాజు, పప్పల కృష్ణమూర్తి, కర్రోతు నాగేశ్వరరావు, పల్లి కృష్ణ, గిడిజాల సింహాచలం, జమ్ము రమణ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అప్పలనాయుడు, నియోజకర్గం పరిశీలకులు నెక్కల నాయుడు బాబు, తదితరులు

వైఎస్సార్‌సీపీలో చేరిక

భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన 20 కుటుంబాలు, గుడివాడ గ్రామానికి చెందిన 15 కుటుంబాలు ఆదివారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గం పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి చేసి ఉంటేనే ఓటు వేయండి అని అడుగుతున్న దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన చింతాడ వాసులు, బొబ్బిలి ముస్లిం పెద్దలు



ఎమ్మెల్యే శంబంగి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన చింతాడ వాసులు

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పాలన కలుగుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని చింతాడ గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ లో చేరారు. మండలంలోని పక్కిలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సర్పంచ్ బంకురు తిరుపతిరావు, కర్రి సూర్యనారాయణల ఆధ్వర్యంలో చేరిన వారిలో మాజీ ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణ, మాజీ కోఆపరేటివ్ అధ్యక్షుడు కర్రి సీతంనాయుడు, మాజీ వార్డు సభ్యుడు కర్రి జగన్నాధం, మరడాన బలరాం, లచ్చిరెడ్డి లక్ష్మణ, మరడాన పోలినాయుడు, కర్రి సత్యనారాయణ, కర్రి భాస్కరరావు, మైరాల సింహాచలం తదితరులున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శంబంగి వేణుగోపాలనాయుడు ఉన్నారు.



ఎమ్మెల్యే శంబంగితో జామియా మసీదు మాజీ అధ్యక్షుడు

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి జామియా మసీదు నాయకుడు

పట్టణంలోని ప్రముఖ జామియా మసీదు మాజీ అధ్యక్షుడు, ముస్లింల నాయకుడు అబ్దుల్ హమీద్ అతని అనుచర వర్గంతో కలసి ఆదివారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం టీడీపీ నేతలకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

టీడీపీకి బిగ్ షాక్

- ధర్మవరం నుంచి 300 కుటుంబాలు
- సర్పంచ్, నలుగురు వార్డు సభ్యులు చేరిక



ఎస్.కోట: వైఎస్సార్‌సీపీలో చేరిన ధర్మవరం గ్రామస్తులు

శృంగవరపుకోట: ప్రచారంలో ముందంజలో ఉన్న వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ జోరు మరింత పెరుగుతోంది. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి బిగ్ షాక్ తగిలింది. టీడీపీకి చెందిన సర్పంచ్, వార్డు సభ్యులు వైఎస్సార్‌సీపీ గూటికి చేరారు. మండలంలోని ఎస్.కోట తర్వాత మరో పెద్ద మేజర్ పంచాయతీ అయిన ధర్మవరంలో ఫ్యాన్ ప్రభంజనం వీస్తోంది. తెలుగుదేశం పార్టీకి చెందిన ధర్మవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ గాలి సన్యాసయ్య, వార్డు సభ్యులు తమ గ్రామానికి చెందిన 300 మందితో కలిసి ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరంతా ధర్మవరం నుంచి ఎస్.కోటలో ఎమ్మెల్యే కార్యాలయం వరకూ భారీ ర్యాలీగా వచ్చారు. వీరిని సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు తదితర నాయకులు వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆది నుంచి మంచి రాజకీయ ప్రాధాన్యం, చైతన్యం ఉన్న ధర్మవరం గ్రామం నుంచి ఇంత భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరటం శుభపరిణామం అన్నారు. వార్డు సభ్యులు, దోర కాంతం, అలమండ ప్రసాద్, రొబ్బి కోటలక్ష్మి, దాసరి వెంకట కల్యాణిలతో పాటూ 300 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. పాలకుర్తి హరనాధ్, ఎస్.కోట వార్డు మెంబర్ కె.భారతి సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్, ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పి.వెంకటరమణ, ఎమ్పీటీసీ డి.కనకమహాలక్ష్మి, మండల యువత అధ్యక్షుడు అల్లు సుధీర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, జామి మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె రవి, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, డా.వరలక్ష్మి, అల్లు మహాలక్ష్మినాయుడు, లగుడు అవతారం తదితర నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కింది



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అందజేత
- చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు
- విద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి
- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

గజపతినగరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని శతశాతం నెరవేర్చి ప్రజల హృదయాల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కులం, మతం, పార్టీ, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సాధ్యం కాని హామీలను నెరవేరుస్తానని చంద్రబాబులా ప్రజలకు వాగ్దానం చేయకుండా సాధ్యమైన హామీలను మాత్రమే ఇస్తానని చెప్పి వాటిని అర్హులైన వారందరికి ఇచ్చారని అన్నారు. జగన్ పరిపాలన విధానం రానున్న రోజుల్లో భావితరాల వారికి స్వర్ణయుగంగా ఎంతో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి అత్యధికంగా నిధులు ఖర్చు చేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించారని అన్నారు. ప్రతీ నియోజకవర్గానికి వెయ్యి నుంచి 13వందల కోట్ల రూపాయిల వరకు ఖర్చు పెట్టి అభివృద్ధి చేశామని గర్వంగా చెప్పుకుంటున్నామని అన్నారు. చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా తీసుకొచ్చిన మేనిఫెస్టోపై ప్రజలు విశ్వసనీయతను చూపుతున్నారన్నారు. వారి వెంట వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నారాయణమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

టేకు తోట దగ్ధం

బొండపల్లి: మండలంలోని కంచిరెడ్డిపాలెంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న నాలుగు ఎకరాల విస్తీర్ణంలోని టేకు తోట దగ్ధమైంది. గ్రామానికి అనుకోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారానికి మంటలు అంటుకొని క్రమంగా సమీపంలోని టేకు తోటకు మంటలు వ్యాపించాయి. గజపతినగరం అగ్ని మాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

ప్రభుత్వ పనిప్రదేశంలో ప్రచారం?



వేతనదారులకు టీడీపీ టోపీలు ఇచ్చి ప్రచారం చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని సంధ్యారాణి

సాలూరు: ప్రభుత్వ నిధులతో పని జరుగుతున్న ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారం చేయడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు కాదా? అని వైఎస్సార్‌సీపీ పాచిపెంట మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ తట్టికాయల గౌరిశ్వరరావు తదితరులు ప్రశ్నిస్తున్నారు. ఈ మేర కు మండలంలోని కర్రివలస పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పని జరుగుతున్న ప్రాంతం వద్దకు సాలూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి శనివారం వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న వేతనదారులకు స్థానిక టీడీపీ నాయకులు ఆ పార్టీ టోపీలను పంచిపెట్టగా, సంధ్యారాణి ప్రచారం చేయడాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పుబట్టారు. ఇలా ప్రభుత్వం వేతనాలు ఇస్తున్న ఉపాధి హామీ పని ప్రాంతానికి వెళ్లి సంధ్యారాణి ప్రచారం చేయడం, పైగా అక్కడ వేతనదారులందరికి టీడీపీ టోపీలు ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు వస్తుందా? రాదా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై పీడిక రాజ్జనదొర దృష్టికి తీసుకువెళ్తామని, ఈసీకి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికా రి, సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్పందించాలని కోరారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి



ఆర్యవైశ్యుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఆర్యవైశ్యుల అభివృద్ధికి తగు ప్రాధాన్యత కల్పించి కృషి చేస్తామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గరివిడి వాసవీమాత కల్యాణ మండపంలో ఆదివారం గరివిడి ప్రాంతానికి చెందిన ఆర్యవైశ్యులతో మజ్జి శ్రీనివాసరావు సమావేశమై మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి సమప్రాధాన్యత కల్పించి న్యాయం చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నాయకత్వంలో అందరినీ ఆదుకున్నామన్నారు. ఎలాంటి కష్టమొచ్చినా అండగా నిలబడతామని భరోసా కల్పించారు. కష్ట సుఖాల్లో మీతోనే ఉన్నామని, రానున్న రోజుల్లో కూడా మీతోనే ఉంటామని, మీ ఆశీస్సులు ఆదరాభిమానాలు అందించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, రాజాం నియోజకవర్గ పరిశీలకుడు కెవి.సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, ఏపీఎస్ఐడీసీ బమ్మిడి అప్పలస్వామి, మాజీ వైస్ ఎంపీపీ ముల్లు రాంబాబు, వైస్ సర్పంచ్ బమ్మిడి కార్తీక్, పి.కుమార్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.